సాక్షి
కర్నూలు
మంగళవారం ¦ 31 ¦ డిసెంబర్ ¦ 2024



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవ నిర్వహించింది. పురాతన మండపంలో ఉత్స వమూర్తులకు అర్చకులు పూజలు చేశారు.



అలరించిన నృత్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యావేదికపై సోమవారం ఒంగోలుకు చెందిన రాఘవ కూచి పూడి నృత్య సంగీత కళానిలయం కళాకారులు సంప్రదాయ నృత్యంతో అలరించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,626.56
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 81.661
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 245
అవుట్ ఫ్లో	: 9,035

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగంలో పలువురికి చోటు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్య క్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమిటీలో పలువురికి చోటు లభించింది. మొత్తం 8 మందిని పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా, ఐదుగురిని ప్రధాన కార్యదర్శులుగా నియమిం చింది. జిల్లా కమిటీలో వీరందరిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్షులుగా జి. కొండా వెంగన్న (పాణ్యం), కె. జగన్‌మోహ న్‌రెడ్డి (ఎమ్మిగనూరు), ఎస్. కె. గిరి (ఆలూరు), వై. ప్రదీప్ రెడ్డి (మంత్రాలయం), హెచ్. చం ద్రకాంత్ రెడ్డి (ఆదోని), ఎల్. వెంకటేశ్వర్లు (కోడుమూరు), జె. నగేష్ (పత్తికొండ), అహ మ్మద్ ఆలీ ఖాన్ (కర్నూలు), ప్రధాన కార్యదర్శు లుగా అక్కెం హనుమంత రెడ్డి (పాణ్యం), పాటిల్ హనుమంతరెడ్డి (కోడుమూరు), షేక్ అబ్దుల్ షరీఫ్ (కర్నూలు), జె. రామాంజనే యులు (కర్నూలు), ఎం. ప్రభాకర్ (కోడు మూరు) ఉన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జనవరి నెలకు సంబం ధించిన పింఛన్లను డిసెంబరు 31వ తేదీనే పం పిణీ చేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేశారు. జనవరి 1న నూతన సంవత్సర వేడుకలు ఉన్నందున ఒక రోజు ముందుగానే మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,55,929 పింఛన్లకు రూ.194.65 కోట్లు సోమవారం బ్యాంకులకు విడుదల అయ్యాయి. కర్నూలు జిల్లాలో 2,39,818 పింఛన్‌లకు సంబంధించి రూ.102 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,16,111 పింఛన్‌లకు సంబంధించి రూ.91 కోట్లు ప్రకారం రూ.194 కోట్లు మంజూరు అయ్యా యి. గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసి స్టెంట్లు బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ము డ్రా చేశారు. అయితే డిసెంబరు నెలతో పోలిస్తే జనవరి నెలలో 1,007 పింఛన్‌లపై కోత పడిం ది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నెలనెలా గుట్టుచప్పుడు కాకుండా పింఛన్‌లో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి నెల సచివాల ఉద్యోగులు ఇంటి దగ్గరే పింఛన్‌లు పంపిణీ చేస్తున్నారని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇదిలా ఉంటే స్పౌజ్ కేటగిరి కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు 369 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

ఫిబ్రవరిలో ఉరుకుందలో కుంభాభిషేకం



మాట్లాడుతున్న ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో ఫిబ్రవరిలో మహా కుం భాభిషేకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలి పారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఆగమశాస్త్ర నిపుణుల సూచనలు పరిగణ లోకి తీసుకుని ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శైవ, వైష్ణవ సంప్రదాయాలు కలిగిన అరుదైన ఆలయాల్లో ఉరుకుంద క్షేత్రం ఒకటన్నారు. పాత రాజగోపురంతో పాటు నూతనంగా నిర్మించిన నాలుగు రాజగోపురాల కు కలశాల ప్రతిష్ఠతో పాటు గణపతి దేవాల యం, లక్ష్మీఅమ్మవారి దేవాలయం, నూతన ధ్వజ స్తంభం, యాగశాల, నవగ్రహ మండపం ప్రతిష్ఠాపన కోసం మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి ఆయా మఠాల పీఠాధిపతులు తరలిరానున్నారన్నారు. సమావే శంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్ప స్వా మి, వేద పండితుడు మోహన్ పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి



జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పింఛన్‌దారులు జీవన ప్రమాణ ప్రతం (లైఫ్ సర్టిఫికెట్) సంబం ధిత సబ్ ట్రెజరీల ద్వారా అప్‌లోడ్ చేయాలని జిల్లా ట్రెజరీ, లెక్కల అధికారి రామచంద్రరావు సూచిం చారు. సోమవారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే విధానం గురించి వివ రించారు. ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సంబంధిత సబ్ ట్రెజరీల్లో అంద జేయాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక కౌం టరు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



వ్యవసాయానికి కలసి రాలేదు

2024 సంవత్సరం వ్యవసాయానికి కలసి రాలేదు. ఈ ఏడాది జూన్ 19, 20 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో సెంట్రల్ టీమ్ పర్యటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ నార్మ్స్ ప్రకారం రైతులకు రూ. 96 కోట్లకు పైగా పరిహారం విడుదల చేయాల్సి ఉన్నా పట్టించుకో లేదు. కర్నూలు జిల్లాలో 32 మంది, నంద్యాల జిల్లాలో 19 మంది బలవన్మరణాలకు పాల్ప డ్డారు. అయినా రైతు కుటుంబాలకు పరిహారం అందించిన దాఖలాలు లేవు.



'మహా' రథోత్సవం

మంత్రాలయంలో ఆగస్టు నెలలో సద్గురు రాఘవేంద్ర స్వామి ఉత్తరారాధనను పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో మహా రథోత్సవం వైభవంగా జరిగింది. రథంపై కొలు వైన ప్రహ్లాదరాయలకు పుష్పార్చన, మంగళహారతులు పట్టారు. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని తరించారు.



క్యాన్సర్‌ను తరిమేలా..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో రూ.120 కోట్ల అంచనాతో నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను మార్చి 7న అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ పి.శాంతికళ ఈ నెల 27న బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెం ట్‌గా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అక్టోబర్ 29న బాధ్యతలు స్వీకరించారు.

వెలుగులను మింగిన చీకట్లు



కొత్త ప్రజాప్రతినిధులు..

2024 పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు జిల్లాలో మే 13న ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన ఫలితాలు వచ్చాయి. కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి బీసీ సామా జిక వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజు ఎన్నిక య్యారు. కర్నూలు అసెంబ్లీకి టీజీ భరత్, కోడుమూరుకు బొగ్గుల దస్తగిరి, పాణ్యంకు గౌరు చరితారెడ్డి, మంత్రాలయానికి మరోసారి బాలనా గిరెడ్డి, ఆదోనికి బి.పార్థసారథి, ఆలూరుకు బి.వి రూపాక్షి, పత్తికొండకు కేఈ శ్యామ్‌కుమార్, ఎమ్మిగ నూరు శాసన సభ సభ్యుడిగా బీవీ జయనాగేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు.



కాల చక్రంలో 2024 సంవత్సరం మరి కొద్ది గంటల్లో కరిగి పోతుంది. జిల్లా ప్రజలకు ఈ ఏడాది తొలి ఆర్నెల్లు ఆనందం.. చివరి ఆర్నెల్లు ఆందోళనలు మిగిల్చింది. జననేత వైఎస్ జగన్ పాలనలో సంక్షేమ పథకాలు అందుకుని ప్రజలు ఆనందాలతో జీవనం సాగించారు. అంతలోనే ప్రభుత్వం మారిపోగా అన్ని వర్గాలకు అవస్థలు తోడయ్యాయి. వ్యవసాయం నష్టాలు మిగిల్చింది. సంక్షేమ పథకా లు దూరమయ్యాయి. అభివృద్ధి నిలిచిపోయింది. అన్ని వర్గాల్లో ఆందోళన మొదలైంది. కూటమి పాలకులు హామీలు వల్లె వేస్తున్నారే కానీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు. అంతలోనే ఎంత మార్పు అంటూ ఈ ఏడాదిలో చోటు చేసు కున్న సంఘటనలు జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్, కర్నూలు



కూటమి పాలనపై తిరుగుబాటు

'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ'లో భాగంగా డిసెంబర్ 13వ తేదీన జిల్లా కేంద్రం కర్నూలులో నిర్వహించిన ఆందోళనకు భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కూటమి ప్రభుత్వం హామీలు విస్మరించడంతో ప్రజలు ఆందోళన బాట పట్టారు. డిమాండ్ల సాధన కోసం ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, రాజకీయ పార్టీలు దండెత్తాయి. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైఎస్సార్‌సీపీ, ఇసుక రేట్లను తగ్గించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని వామపక్ష పార్టీలు పెద్ద ఎతున ఆందోళనలు నిర్వహించాయి. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేపట్టరాదని దేవనకొండ మం డల ప్రజలతోపాటు ప్రజా సంఘాలు చేప ట్టిన ఆందోళనకు ప్రభుత్వం దిగివచ్చింది. తాత్కాలికంగా యురేనియం తవ్వకాలు చేపట్టమని ప్రకటన చేసింది. మరో వైపు తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, ఫీల్డ్ అసి స్టెంట్లు, మేటీలు తమకు ఉద్యోగ భద్రత తోపాటు వేతనాలు పెంచాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళనలతో హోరెత్తించారు.



అధికారుల మార్పు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భారీస్థాయిలో అధికారులకు స్థాన చలనం కలిగిం చారు. జిల్లా కలెక్టర్‌గా పి.రంజిత్‌బాషా, జేసీగా బి.నవ్య, డీఆర్వోగా వెంకటరమణమ్మ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌డీఓలు, మండలాల తహసీల్దార్లు, జిల్లాస్థాయి అధికారులు సైతం మారారు.



అట్టహాసంగా 6వ పట్టాభిషేకం...

కర్నూలు నగర శివారులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్(ఐఐఐటీడీఎం)లో ఈ ఏడాది జూన్ 22వ తేదీన 6వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సభ్యుడు, జేఎన్‌యూ చాన్స్‌లర్ డాక్టర్ వీకే సారస్వత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవంలో 2020–24 విద్యా సంవత్స రానికి సంబంధించి బీటెక్ పూర్తి చేసిన 143 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. ఐదుగురు విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.



ముగ్గురు మంత్రులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మ నూరు జయరాం మంత్రులుగా ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు కొలువుదీరారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జూలై 19వ తేదిన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమా వేశానికి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్ హాజరయ్యారు.

పసిడి ధగధగ



ఈ ఏడాది 'పసిడి'కాంతులు విరజి మ్మాయి. గతంలో ఏ సంవత్సరంలో లేని విధంగా బంగారం ధరలు ధగధగలా డాయి. ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది జనవరి 1వ తేదీన 10 గ్రాముల ఆర్నమెంటు బంగారం ధర రూ.50,600 ఉంది. ఈ ఏడాది డిసెంబరు నెలలో 10 గ్రాముల బంగారం ధర రూ.73,500లకు చేరింది. అంటే రికార్డు స్థాయిలో 10 గ్రాములపై రూ.22,900 పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు రూ.5 వేల కోట్ల బంగారం వ్యాపారం జరిగినట్లు అనధికార సమాచారం.

రక్తమోడిన 'గట్టు'



విజయ దశమిని పురస్కరించుకొని అక్టోబర్ 12వ తేదీ అర్ధరాత్రి దేవర గట్టులో బన్ని ఉత్సవం వైభవంగా జరిగింది. సంప్రదాయ కర్రల సమరం వేడుకగా సాగింది. భక్తులు కర్రలు చేత పట్టి ఆనద తాండవం చేశారు. పసుపు వర్ణంలోని బండా రాన్ని చల్లుతుండగా కర్రలు కరాళ నృత్యం చేశాయి. దేవర గట్టు రక్తమోడుతున్నా మాళ మల్లేశ్వరుడి జైత్రయాత్రను భక్తులు విజ యవంతం చేశారు. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుం చి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి వేడుకను వీక్షించారు.

అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన కోలా ప్రతాప్ కుమార్



క్రీడా ఆణిముత్యాలు మెరిశాయ్!

అక్టోబర్‌లో ఈజిప్టులో జరిగిన అంతర్జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడా అండర్–17 విభాగంలో కర్నూలు నగరానికి చెం దిన చిరు చరణ్ తేజ క్యాంస పతకం సాధించారు. సింగపూర్‌లో షిటోర్యు కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలుకు చెందిన కరాటే మాస్టర్ కోలా ప్రతాప్‌కుమార్ కాంస్య పతకం సాధించారు.



తారాగణం.. తళుక్కుమంది

రవితేజ, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ కర్నూలు నగరంలో ఆగ స్టులో జరిగింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో హాస్య బ్రహ్మ బ్రహ్మానం దం, సినీ హీరోయిన్లు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరిలు నగరం లోని షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బా షా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయం త్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భ ంగా కలెక్టర్ మాట్లాడతూ.. యూనివర్సిటీలు, కళాశా లలు, పాఠశాలల్లో విద్యార్థులతో సమన్వయ కమిటీ లను ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాలనియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. చాలా పాఠశాలలు, కళాశాలల ఆవరణలు, ఆట స్థలాల్లో సాయంత్రం తరువాత మందబాబులు మద్యం సేవిస్తున్నారని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందించి సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య పాఠశాలలు, కళాశాలల్లో పోలీసు బీట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడు తూ..మత్తు పదార్థాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాద ద్రవ్యాలను పూర్తిస్థాయిలో నివారించడానికి టోల్ ఫ్రీనంబర్ 1972ను కేటాయించినట్లుచెప్పారు. ప్రైవేట్ కళాశాలల్లోనూ మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీటీసీ శాంత కుమారి,జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్, డీఎంహెచ్ఓ శాం తిలత, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, చిత్రంలో ఎస్పీ బిందుమాధవ్

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)లో వచ్చి న అర్జీలను ఎప్పటికప్పుడు చూసి సరైన ఎండార్స్‌మెం ట్ ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా అధికారు లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సున యన ఆడిటోరియంలో జేసీ డాక్టర్ బి.నవ్యతో కలిసి కలెక్టర్ ప్రజల వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..పీజీఆర్ఎస్‌కు సంబంధించి సోమవారం వచ్చే అర్జీలే కాకుండా సీఎంఓ, డిప్యూటీ సీఎం, మంత్రుల పేషీల నుంచి వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 6,875 అర్జీలు రాగా 878 మాత్రమే పరిష్కామయ్యా యన్నారు. హోళగుంద మండలంలో 222 దరఖా స్తులు రాగా 10 మాత్రమే పరిష్కారమయ్యాయని, హాలహర్విలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో కూడా తహసీల్దార్‌కు తెలియని పరిస్థితి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కలెక్టరేట్ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు.

నిఘా నీడలో కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు

- మొదటి రోజు 280 మంది హాజరు
- పరుగు పోటీలను ప్రారంభించిన ఎస్పీ
- నెల రోజుల పాటు సాగనున్న ప్రక్రియ



పరుగు పోటీలో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

కర్నూలు: కానిస్టేబుల్ నియామక పరీక్షలో ద్వితీయ ఘట్టం శారీరక, దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభ మయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10,143 మం ది ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తర్ణులయ్యారు. అం దులో మొదటి రోజు సోమవారం 600 మందిని దేహ దారుఢ్య పరీక్షలకు ఆహ్వానించగా 280 మంది హాజర య్యారు. మొదట ధ్రువపత్రాలు, శారీరక కొలతల పరి శీలన (పీఎంటీ), దేహదారుఢ్య పరీక్ష (పీఈటీ) నిర్వ హించారు. ఇందులో అర్హత పొందినవారికి లాంగ్‌జం ప్, పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రారంభించారు.

వేకువజామునే మైదానానికి

పరీక్ష విధులకు నియమించిన పోలీసు, సాంకేతిక, పోలీసు కార్యాలయ పరిపాలనా విభాగం సిబ్బందితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ) వేకువజా మున 5 గంటలకే ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం మైదానానికి చేరుకున్నారు. అప్పటికే క్యూలో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలించి బయోమెట్రిక్ అథెంటి కేషన్ ట్యాగ్‌లు, క్యూఆర్ కోడ్‌తో ఉన్న టీషర్టులు ధరిం పజేసి పోటీలు నిర్వహించారు. ఇదిలా ఉంటే రిక్రూట్‌మెంట్ నిర్వహణ జరుగుతున్న మైదానం చుట్టూ భారీ పోలీసు బందోబస్తుతో పాటు ప్రతి ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి నిఘా నీడలో పరీక్షలు జరిపారు.రిక్రూట్‌మెంట్ బోర్డు కేటా యించిన తేదీల్లో అభ్యర్థులు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది.

పీఎంటీ, పీఈటీ పరీక్షలు ఇలా....

పురుషుల ఎత్తు 167.6 సెం.మీ, ఛాతీ కొలత 86.3 సెం.మీ ఉండాలి. గాలి పీల్చినప్పుడు మరో 5 సెం .మీ. పెరగాలి. ఇందులో అర్హత సాధించిన వారికి మాత్రమే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. 2.30 మార్కులకు నిర్వహించే 100 మీటర్ల పరుగును మాజీ సైనికులు 15.5 సెకన్లు, యువ అభ్యర్థులు 15 సెకన్లలో పూర్తి చేయాలి. అలాగే 3.40 మార్కులకు 1600 మీటర్ల పరుగును మాజీ సైనికులు 9.30 నిమిషాలు, సాధారణ అభ్యర్థులు 8 నిమిషాల్లో పూర్తి చేయాలి. హైదరాబాద్‌కు చెందిన టైమింగ్ టెక్నాలజీ సంస్థ వారు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఐఎఫ్‌డీ) చిప్ ట్యాగ్‌లు ఏర్పాటు చేశారు. దేహదారుఢ్య పరీక్షలు మొదలైన ప్పటి నుంచి అభ్యర్థి ఛాతీ నెంబర్‌పై క్యూఆర్‌తో కూడిన బ్యాడ్జీతో పాటు కాళ్లకు సెన్సార్ చిప్ ట్యాగ్‌లు అమర్చి పరుగు పోటీలు నిర్వహించారు. రోజుకు సగటున 600 మంది చొప్పున ఈ పరీక్షలు నిర్వహించ నున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కార్యక్రమం లో హోంగార్డు సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాల్వలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామం బస్టాండు సమీపంలో ఉన్న కాల్వలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ సోమవారం తెలిపారు. సుమారు 30–40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. రెండు రోజుల నుంచి గుండుపాపల, ఒంటివెలుగల గ్రామాల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందినట్లు తెలిసిందన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికి తీసినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వెంటనే 9121101178, 9121101166 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్లిక్ చేశాడు..డబ్బు మాయం

కొలిమిగుండ్ల: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూనే ఉన్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట అమాయకులు సైబర్ కేటుగాళ్ల బారిన పడి మోసపోతూనే ఉన్నారు. సోమవారం కనకాద్రిపల్లెకు చెందిన ఓ యువకుడు రూ.25 వేలు పోగొట్టుకున్నాడు. ఎస్‌బీఐకి చెందిన యూనో పాస్ వర్డ్ లాక్ అయింది.. మార్చుకోమని సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. ఏమాత్రం ఆలోచించకుండా ఆ యువకుడు తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. డేటా అంతా వారి చేతుల్లోకి వెళ్లిపోవడంతో అకౌంట్‌లో ఉన్న రూ.25 వేలు మాయమయ్యాయి. మోసపోయానని తెలుసుకొని 1930 కాల్ సెంటర్‌కు సమాచారం ఇచ్చాడు.

39.549 కేజీల గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన 39.549 కేజీల గంజాయిని పోలీసులు పట్టణ శివారులో దహనం చేశారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన 17 కేసుల్లో 39.549 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు దహనం చేశామన్నారు.

మత్తు పదార్థాలు సీజ్

డోన్ రూరల్: 2.3 కేజీల(ఓపీఎం పాపి హస్క పౌడర్) మత్తు పదార్థాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్యాపిలి మండలం ఎనుగమర్రి గ్రామంలోని మహదేవ్ హోటల్ వద్ద దాడులు నిర్వహించగా రాజస్తాన్ రాష్ట్రం నాగూర్ జిల్లా మెర్టా మండలం సంక్‌హవాస్ గ్రామానికి చెందిన నార్పత్ అనుమానంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని సోదాలు చేశామన్నారు. అతని వద్ద మత్తు పదార్థాలు ఉండటంతో అరెస్ట్ చేసి 2.3 కేజీల మత్తు పదార్థం స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీఐ.జయ రాంనాయుడు, ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీ నారాయణ, సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి, నరసింహులు, అల్లస్వామి, బషీర్ పాల్గొన్నారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండి ఆత్మకూరు: మండలంలోని వెంగళరెడ్డి పేట గ్రామానికి చెందిన మందుబాబు గుర్రప్పకు నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారని ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. గుర్రప్ప గ్రామంలో మద్యం తాగి చుట్టుక్కల మహిళలను అసభ్యపదజాలంతో తిడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నండగా స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గుర్రప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా జడ్జి 5 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు.

100 మీటర్ల పరుగుపందెం పోటీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్



ఒకటే లక్ష్యం.. ఒకటే గమ్యం

ఉద్యోగమే లక్ష్యంగా యువత మైదానంలోకి అడుగు పెట్టింది. అలుపెరగకుండా పరుగులు తీశారు. అడ్డంకులను అధిగమిస్తామంటూ లాంగ్ జంప్ చేశారు. పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏపీఎస్పీ రెండో పటాలంలో సోమవారం అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి


కాలికి ఎలక్ట్రానిక్ చిప్ అమర్చుతున్న సిబ్బంది


అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసులు

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


సీపీఎం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులతో కేంద్ర, రాష్ట్ర నాయకులు

- జిల్లా మహాసభలో తీర్మానం

ఎమ్మిగనూరు టౌన్: జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర అంశాలపై సీపీఎం 23వ జిల్లా మహాసభ తీర్మానించింది. రెండు రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభల్లో భాగంగా సోమవారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నిర్మల, రామన్న పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, జిల్లాలో ఐటీ, ఫార్మా కంపెనీల ఏరాటు, జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సభలో తీర్మానం చేసినట్లు వారు పేర్కొన్నారు. దళితులపై దాడులను ఆపాలని, వృత్తిదారుల సమస్యలు పరిష్కరించి గొర్రెలు, మేకల పెంపకం దార్లకు ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని, చేనేత కేంద్రాల్లో చేనేత పార్కులు ఏర్పాటు చేయాలని సభలో తీర్మానం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యద ర్శిగా రెండోసారి గౌస్‌దేశాయ్‌ను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.నిర్మల, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కెవి.నారాయణ, ఎండీ అంజిబాబు, ఆనంద్‌బాబు, టి.రాముడులను ఎన్నుకున్నారు.

అమిత్‌షా హోంమంత్రిగా అనర్హుడు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆ పదవికి అనర్హుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగకర్తను అవమానపరిచిన హోం మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, గోవిందు, హనుమంతు పాల్గొన్నారు.

కుల గణన జాబితాలో ఎస్సీయేతరులను తొలగించండి


డీడీకి వినతి పత్రం అందిస్తున్న డీవీఎంసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డ్ కులాల కుల గణనకు సంబంధించి గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన జాబితాల్లోని ఎస్సీయేతర కులాలను తొలగించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సభ్యులు రమేష్‌బాబు, రవిశాస్త్రి, చిటికెల సామేల్, ఎరుకల రాజు, శాంతికుమార్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే తులసీదేవిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు జాబితాలో మాల, మాదిగ, మాల క్రిష్టియన్, మాదిగ క్రిష్టియన్, ఆది ఆంధ్ర తదితర కులాలు కాకుండా ఎస్సీయేతర కులాలు ఉన్నాయన్నారు. తప్పుడు సమాచారంతో మదాసి కురువ, బేడ బుడగ జంగం, బరికి, పంబాల తదితర కులాల పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని, వాటన్నింటిని గ్రామ సచివాలయాల్లో తొలగించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రేమాండ్ పీటర్ 10 కులాలను ఎస్సీ కులాల జాబితాలో నుంచి తొలగించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాశారన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

2, 3 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన


పొలాల్లో పర్యటిస్తున్న వ్యవసాయాధికారులు

కౌతాళం: మండలంలో జనవరి 2, 3 తేదీలలో కేంద్ర బృందం పర్యటించనుందని ఏడీఏ బాలవర్ధిరాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఉరుకుంద, ఓబుళాపురం, చిరుతపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. జరిగిన పంట నష్టం గురించి కేంద్ర బృందం అధికారులకు పూర్తిగా వివరించాలని రైతులకు సూచించారు. పెట్టినపెట్టుబడి, జరిగిన నష్టం వారికి తెలపాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శేషాద్రి తదితరులు ఉన్నారు.

నేడు వ్యవసాయ ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం మంగళవారం జరగనుంది. బి.క్యాంపులోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఈ ఎన్నిక ఉంటుందని వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రూపేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో ఆఫీసు సబార్డినేట్ నుంచి పరిపాలన అధికారి వరకు అన్ని కేటగిరి ఉద్యోగులు ఉంటారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగులందరు హాజరు కావాలని కోరారు.

బ్యూటీ పార్లర్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. ని శిక్షణలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు నాలుగు ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90007 10508 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

పాఠశాలలో 13 ట్యాబ్‌లు చోరీ

బనగానపల్లె: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి సుమారు రూ.2లక్షల విలువ చేసే 13 ట్యాబ్‌లు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ట్యాబ్‌లు ఉన్న గది కిటికీని ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. కాగా ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు పాఠశాలకు వెళ్లి చోరీ జరిగిన ఘటనపై ఆరా తీశారు.

మహానందీశ్వరుడి భూమికి పట్టాదారు పాస్‌బుక్!

- రుణం తీసుకున్న ఇనాందారుడు
- సర్వే చేయించిన దేవస్థానం అధికారులు

మహానంది: మండలంలోని తమ్మడపల్లె గ్రామ పరిధిలో ఉన్న మహానందీశ్వరస్వామి దేవస్థాన భూములను పూర్వం సర్వీస్ ఇనాం కింద కొందరికి ఇచ్చారు. ఇనాం దారుడు తన పేరుతో పట్టాదారు పాసుపుస్తకం పుట్టించి రుణాలు పొందినట్లు గుర్తించామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ్మడపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 314లో 1.19 ఎకరాలు, 303 సర్వే నెంబరులో 8.74 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వీటిని కుమ్మరులు, అనకల(మామిడి తోరణాలు కట్టేవారు)కి పూర్వం సర్వీస్ ఇనాం కింద ఇచ్చారన్నారు. వీటిలో 1.19 ఎకరాల భూమికి పట్టాదారు పుస్తకం తయారు చేయించి ఓ బ్యాంకులో రుణం పొందినట్లు గుర్తించామన్నారు. దీంతో పూర్తిస్థాయి విచారణ చేసి సంబంధిత భూములు మహానందీశ్వరస్వామి దేవస్థానానికే చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారిని కలిసి విన్నవించామన్నారు. రెవెన్యూశాఖలో పనిచేసే ఓ కీలక ఉద్యోగి ఈ ఘటనకు సూత్రధారి అని సమాచారం. దీంతో పాటు మరో రెవెన్యూ గ్రామ పరిధిలోనూ మహానంది దేవస్థానానికి చెందిన ఐదు ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకుని రుణాలు పొందుతున్నట్లు సమాచారం. వాటి మీద సమగ్ర విచారణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దొంగలు దొరికారు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీశైలం: చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దొంగల వివరాలను సీఐ ప్రసాద్‌రావు విలేకరులకు వెల్లడించారు. ఈనెల 17న షేక్ ఫకృద్దీన్ తన ఆటోలో ఉన్న అమరాన్ బ్యాటరీని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశాడు. అలాగే పరిసర ప్రాంతాల్లోని టీ స్టాల్స్‌లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు చోరీకి గురవుతుండటంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా షేక్ మస్తాన్ వలి, జే.భాస్కర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బ్యాటరీతోపాటు రెండు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన వన్ టౌన్ పోలీసులు గురవయ్య రాజేంద్ర కుమార్ రఘునాథుడు శివమహేంద్ర, బాలకృష్ణ, నాను నాయక్‌లను సీఐ ప్రశంసించారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్ష


హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరురూరల్: ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి రక్షించుకోవాలని డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద సోమవారం ఆయన హెల్మెట్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డీఎస్పీ హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతోపాటు పౌరులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. చక్రం హోటల్ వరకు ర్యాలీగా వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు


తీవ్ర గాయాలైన క్లీనర్ అహమ్మద్


లారీలో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ ప్రవీణ్


నుజ్జునుజ్జ అయిన లారీ ముందు భాగం

బనగానపల్లె రూరల్: మండలంలోని జ్వాలాపురం గ్రామ సమీపంలో దద్దణాల ప్రాజెక్టు వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లుకు చెందిన లారీ డ్రైవర్ బి ఎర్రన్న, క్లీనర్ అహమ్మద్ పెట్రోల్ లోడ్ ట్యాంకర్‌తో కోవెలకుంట్లకు బయల్దేరారు. తమిళనాడు రాష్ట్రం పెరంబలూరు జిల్లాకు చెందిన ప్రవీణ్ యనకండ్ల గ్రామ సమీపంలోని జయజ్యోతి సిమెంట్ కంపెనీ నుంచి క్లింకర్ లోడ్‌తో గుంతకల్లు వైపు బయల్దేరాడు. దద్దణాల ప్రాజెక్టు మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ డ్రైవర్ ప్రవీణ్ సీటులోనే ఇరుక్కుపోయాడు. మరో లారీ డ్రైవర్ ఎర్రన్న, క్లీనర్ అహమ్మద్ తీవ్రగాయాలపాలయ్యారు. ముగ్గురినీ స్థానికులు అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషాద్రి

కర్నూలు(అర్బన్): స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ వెంకట శేషాద్రి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. నగరంలోని ప్రొఫెషనల్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, చైల్డ్ మేరేజెస్, ఉచిత న్యాయ సహాయంపై వ్యాస రచన, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్టాగామ్ రీల్ తయారీ తదితర పోటీలు నిర్వహించారు. రాయలసీమ విశ్వ విద్యాలయం, ఇంజినీరింగ్ కాలేజీ, జీ పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్, సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, రామక్రిష్ణా డిగ్రీ కళాశాల తదితర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక న్యాయ సేవాసదన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో తమ్ముళ్ల రచ్చ!

- ఎంపీ శబరి, ఎమ్మెల్యే చరిత వర్గీయుల మధ్య వాగ్వాదం
- పరస్పరం దాడికి యత్నం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గీయులు

ఓర్వకల్లు: పాణ్యం నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య నానాటికీ విభేదాలు ముదురుతున్నాయి. బహిరంగంగానే ఇరు వర్గాలు బాహాబాహీకి దిగే స్థాయికి చేరుకున్నారు. సోమవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మరోమారు ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల విభేదాలు రచ్చకెక్కాయి.

మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ నిర్మాణ విషయంలో ఆది నుంచి ఇరువర్గాల మధ్య పరస్పర వ్యతిరేక అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో సోలార్ వివాదం తారాస్థాయికి చేరుకోడంతో బహిరంగంగా కొట్టుకునే వరకూ చేరింది. తహసీల్దార్ విద్యాసాగర్ రెవెన్యూ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతుగా.. మధ్యలో ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుడు మహబూబ్‌బాషా స్టేజి వద్దకు వెళ్లి మా గ్రామంలో సోలార్ పరిశ్రమ గురించి ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పాడు. ఇంతలోనే గౌరు వర్గీయుడు రమణారెడ్డి కల్పించుకొని సోలార్ ప్రస్తావన ఇప్పుడెందుకు వచ్చింది. ఇది రైతుల సమస్యలను పరిష్కరించుకునే కార్యక్రమం కదా.. ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడండి అని అభ్యంతరం తెలిపారు. అనంతరం భోజన విరామానికి వెళ్లిన తర్వాత బజారులో కూర్చున్న గౌరు వర్గీయులను ఎంపీ వర్గీయులు నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు కల్పించుకొని ఇరువురిని వారించి పంపించారు. సాయంత్రం 3 గంటల సమయంలో గౌరు చరిత వర్గీయుడు రాజమోహన్‌రెడ్డి అలియాస్ చిన్నోడు, ఎంపీ వర్గీయులు మహబూబ్‌బాషా, రామకృష్ణ మరోమారు వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి చెప్పులతో కొట్టుకునే వరకూ పరిస్థితి వచ్చింది. గమనించిన పోలీసులు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరు వర్గాల వారు ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనపై కేసు నమోదు చేయాలా?, వద్దా? అని పోలీసులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

అంతర్ జిల్లా దోపిడీ దొంగ అరెస్ట్

- నిందితుడిపై గుంటూరు జిల్లాలో 3 గ్యాంగ్ రేప్ కేసులు


నిందితున్ని చూపుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: రాష్ట్రవ్యాప్తంగా 11 దొంగతనాలు, 3 గ్యాంగ్‌రేప్‌లు, 4 దారి దోపిడీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను జిల్లా పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. దొంగ వివరాలను ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డికుంట గ్రామానికి చెందిన చెంచు దాసరి సుంకన్న కొన్నేళ్ల నుంచి చోరీలు, దారి దోపిడీలకు పాల్పడేవాడు. ఆగస్టులో నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. యజమాని అమర్చుకున్న సీసీ కెమెరా ఆధారంగా నిందితునిపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈక్రమంలో ఆటో నగర్ వద్ద అనుమానంగా తిరుగుతున్న సుంకన్నను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాలు అంగీకరించాడు. రాష్ట్రవ్యాప్తంగా 11 చోరీలు, 4 దారి దోపిడీలు, 3 గ్యాంగ్ రేప్ కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి 3 తులాల బంగారు నల్ల పూసల దండ, ఒక జత 8 గ్రాముల కమ్మలు స్వాధీనం చేసుకున్నారు.

- దాసరి సుంకన్న మరి కొంత మంది నిందితులతో కలిసి 2021 లో 9వ తేది గుంటూరు జిల్లా మేడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌పై వెలుతున్న దంపతులను రాత్రి అటకాయించారు. భర్తపై దాడి చేసి భార్యపై గ్యాంగ్‌రేప్ చేశారు. ఈకేసులో నలుగురు నిందితులకు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈకేసులో ఏ3 గా ఉన్న దాసరి సుంకన్న పోలీసుల కన్నుగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు.
- గుంటూరు జిల్లా యడ్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో రెండు గ్యాంగ్‌రేప్ కేసులు నమోదు కాగా వాటిలో ఏ3గా దాసరి సుంకన్న నిందితుడిగా ఉన్నాడు.

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్


కటౌట్ తీసివేసిన దృశ్యం

డోన్: మహాత్మా మన్నించు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు టీడీపీ నాయకులు స్పందించి తమ తప్పును సరిదిద్దుకున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ కాంస్య విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీల విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో టీడీపీ నాయకులు సోమవారం ఫెక్సీని తొలగించి వేరొక చోట ఏర్పాటు చేసుకోవడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టపగలే చోరీ


బీరువా తాళాన్ని పగలగొట్టిన దొంగలు

గడివేముల: మండల కేంద్రంలోని నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రహదారిలో సీఎస్‌ఐ చర్చి ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సోమవారం గ్రామానికి చెందిన కురువ పెద్దన్న కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. గమనించిన దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 8 తులాల బంగారంతోపాటు రూ.13 వేలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చోరీ జరిగిందని నిర్ధారించుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాతలను అభినందిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సోమవారం రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం వల్ల ప్రమాదంలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. శిబిరంలో విద్యార్థులకు గ్రూపింగ్ టెస్టులు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బి.ఆర్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం అభినందనీయమని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి పేర్కొన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక రూపొందించిన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

ఈసీజీ మిషన్ విరాళం



ఈసీజీ మిషన్, సక్షన్ ఆపరేటర్లతో ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఫిలిప్స్ సంస్థకు చెందిన రెండు ఈసీజీ మిషన్లు, రెండు సక్షన్ ఆపరేటర్లను ఆదోనికి చెందిన దేశాయ్ నర్సింగ్ హోమ్ వారు విరాళంగా అందజేశారు. రూ. లక్ష విలువ చేసే వీటిని సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు సదరు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ వసంతి దేశాయ్ అందజేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాల్లో వీటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్లుశ్రీరాములు,సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఇంగ్లిష్ నైట్ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారు పంచలింగాల సమీపంలోని మాంటిస్సోరి ఒలంపస్ పాఠశాలలో వింటర్ ఫెస్ట్‌లో భాగంగా సోమవారం ఇంగ్లిష్ నైట్ వేడుకలు నిర్వహించారు. ఆ స్కూల్ ప్రదానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మి, స్కూల్ డైరెక్టర్లు కె.ఎస్.వి రవిప్రకాష్, కె.సిదార్థ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, బాషా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఇంగ్లిష్ నాటికలు, పాటలు, డ్యాన్సులతో విద్యార్థులు అదరగొట్టారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ జాబితాలో చేర్చిన కురువ, ఇతర ఉన్నత కులాలను తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బి.రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో ఎస్సీ జాబితాలో కురువలు, రెడ్డి కులస్తులను చేర్చిందన్నారు. వెంటనే విచారణ జరిపి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాదు, గిడ్డయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్స్‌లో ఉన్న జీఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.నాగేశ్వరయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం నగర శివారులోని విజ్ఞానపీఠం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం వారికి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గత 14 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేకు కేక

- నూతన సంవత్సరానికి హాట్ కేకులు సిద్ధం
- వివిధ రకాల డిజైన్లతో తయారీ
- ప్రత్యేక ఆఫర్లతో అమ్మకాల జోరు
- ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్ల వరకు వ్యాపారం



విక్రయాలకు సిద్ధంగా వివిధ రకాలు కేక్‌లు

కర్నూలు కల్చరల్: అదుర్స్ అనిపించే హాట్ 'కేక్' లు మార్కెట్‌లో విక్రయాలకు అందుబాటులో ఉన్నాయి. న్యూ ఇయర్ వస్తుందంటేనే కొత్త ఉత్సాహం వస్తుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు ఎంజాయ్ చేస్తారు. నూతన సంవత్సరానికి గ్రాండ్‌గా వెల్‌కం చెప్పేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు. కొత్త సంవత్సరంలోకి సరికొత్త ఆశయాలతో అడుగుపెట్టేందుకు రొటీన్‌కు భిన్నంగా గడిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. అన్ని వయసుల వారు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర సంబరాలు జరుపుకుంటారు. విద్యార్థులు, యువతీ యువకులు మంగళవారం నుంచే వేడుకల్లో మునిగిపోతారు. ఫ్రెండ్స్ అందరూ సెలబ్రేషన్స్ చేసుకుంటూ, కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ న్యూ ఇయర్ విషెస్ చెప్పుకుంటారు. న్యూ ఇయర్ వేడుకల్లో కేక్ కట్ చేస్తుండటంతో కేకులకు భలే డిమాండ్ ఏర్పడింది.

అభిరుచులకు అనుగుణంగా.. విభిన్న రకాలు

న్యూ ఇయర్ సందర్భంగా బేకరీల నిర్వాహకులు వివిధ రకాలు డిజైన్లు, ఫ్లేవర్లు, రుచులతో ప్రత్యేకమైన కేక్‌లను తయారు చేసి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. రంగు రంగులుగా, రుచిగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. స్ట్రాబెర్రీ, ఆల్మండ్, ప్లం, బటర్ స్కాచ్, వెనీలా పేస్ట్రీ, పైనాపిల్, పిస్తా, ఆరెంజ్, హనీ, కూల్ కేక్‌లకు భారీగా డిమాండ్ ఉంటోంది. కొనుగోలుదారులు ముందుగానే తమకు నచ్చిన మోడల్‌ను ఎంచుకొని అర్డర్ ఇచ్చి చేయించుకుంటున్నారు. కొత్త డిజైన్లతో కేకులను తయారు చేసేందుకు ప్రత్యేకంగా మాస్టర్లను పిలిపించి చేయిస్తున్నారు.



కేక్‌లు తయారు చేస్తున్న మాస్టర్లు



కేక్‌ల ప్యాకింగ్‌కు సిద్ధం చేస్తున్న బేకరీ నిర్వాహకులు

ప్రత్యేక ఆఫర్లు

న్యూ ఇయర్ కేకుల అమ్మకానికి, కొనుగోలుదారులను ఆకర్షించేందుకు కొన్ని బేకరీలు, స్వీటు దుకాణాలు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయాలకు ఏర్పాట్లు చేసుకున్నాయి. వ్యాపారస్తుల్లో నెలకొన్న పోటీ కారణంగా ఒక కేజీ కేక్ కొంటే కూల్ డ్రింక్ ఫ్రీ, రెండు కొంటే ఒకటి ఫ్రీ, కేజీపై రూ.50 తగ్గింపు తదితర ఆఫర్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్ల వరకు వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో సుమారు 3250 వరకు బేకరీలు ఉన్నాయి. న్యూ ఇయర్ వేడుకను జనవరి 1న జరుపుకోవడంతో పాటు యువత ముందు రోజు నుంచే కేక్‌లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డిసెంబరు 31నే కావాల్సింది అర్డర్ ఇచ్చుకుంటున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్'.. అంటూ కేకలు.. కేరింతల మధ్య కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకుంటారు. 31, 1వ తేదీల్లో కేక్‌లకు భలే గిరాకీ ఉండటంతో ఈ రెండు రోజుల్లో రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నారు. కర్నూలు నగరంతో పాటు నంద్యాల పట్టణాల్లోని బేకరీల్లో రెండు లక్షలకు పైగా కేక్‌లు అమ్మకం అవుతాయని అంచనా. కేజీ కేక్ ధర రూ.250, కూల్ కేక్‌లు రూ.500 వరకు విక్రయించనున్నారు. దీంతో సుమారు రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని బేకరీల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: స్థానిక సంతోష్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతోష్‌నగర్, హైదరాబాద్ రోడ్డుకు ఇరువైపులా, బాలాజీనగర్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, శ్రీకృష్ణకాలనీ, కప్పలనగర్, లేబర్ కాలనీ, అమీన్ అబ్బాస్‌నగర్, పున్నమి గెస్ట్‌హౌస్ పరిసరాలలో విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీఆర్‌పీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ), పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్‌ఎంఈ) కింద జిల్లా రిసోర్స్ పర్సన్ ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. ఈ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ ప్రోగ్రాం కింద చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఎంపికైన అభ్యర్థులు పీఎంఎఫ్‌ఎంఈ యొక్క నోడల్ ఏజెన్సీ అయిన ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డీఆర్‌పీలుగా నియమించబడతారని తెలిపారు. 21–30 ఏళ్ల వయస్సు ఉండి గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉండాలని, ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. కర్నూలు జిల్లాకు 25, నంద్యాల జిల్లాకు 29 మంది డీఆర్‌పీలను నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు జనవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే ప్రజలు, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఆమె సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో మినిస్టీరియల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ పనితీరు మెరుగుపరచుకోవాలని చెప్పారు. మినిస్టీరియల్ స్టాఫ్‌కు వారి విభాగానికి సంబంధించిన ప్రతి ఫైలుపై అవగాహన ఉండాలన్నారు. సదరం నుంచి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్ణీత సమయంలో తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తప్పకుండా నమోదు చేయాలన్నారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, ఏడీ రమేష్‌బాబు, ఏఓ శ్రీనివాసులు, ఆఫీస్ సూపరింటెండెంట్ లతీఫ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం

ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అభినందనలు

నూతనంగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు చేపట్టిన సింధు సుబ్రహ్మణ్యంను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ఆసుపత్రి అభివృద్ధికి అందరూ సమష్టిగా పనిచేసి రోగులకు మరింత సత్వరంగా వైద్యసేవలు అందేలా కృషి చేయాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మొదటి సంతకానికే సీఎం చంద్రబాబు తిలోదకాలు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అంటూ ఊరించి, గెలిచిన తరువాత చేసిన మొదటి సంతకానికే తిలోదకాలు ఇచ్చారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు విమర్శించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. డీఎస్సీ, గ్రూపులు, పోలీసు, ఎస్ఐ పోస్టులను భర్తీ చేస్తారా లేదా నిరుద్యోగ భృతి రూ.10 వేలు ఇస్తారా? చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ 16వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు రాజ్‌విహార్ నుంచి సీపీఐ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. నిరుద్యోగం పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో యువత ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్ల కోసం చట్టం చేయాలన్నారు. వెనుకబడిన కర్నూలులో 10 వేల మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

ఎన్నికల హామీలకు తూట్లు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సీఎం చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. ఎన్నికల సమయంలో డీఎస్సీతోపాటు అన్ని రకాల పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మిన్నకుండి పోవడం అన్యాయమన్నారు. యువతకు రూ.10 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి మాట్లాడుతూ.. యువత సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన పూర్తిచేయాలని, వలసలను నివారించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరిరాజేంద్ర మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ మాటలకే పరిమితమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులైనా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న చంద్రబాబు ఆరునెలల్లో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. నాయకులు మునెప్ప, రామకృష్ణారెడ్డి, సోమన్న, షామీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి పోరాటం



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ అన్నారు. సోమవారం వర్సిటీలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను యూనివర్సిటీ కో–కన్వీనర్ మౌలాలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీని అభివృద్ధి చేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. వర్సిటీలో ప్రొఫెసర్ పోస్టు లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని, అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, భరత్, నరేష్, నారాయణ, శివ, గణేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ కాలేజీలో గణిత మేళా

కర్నూలు సిటీ: జాతీయ గణిత వారోత్సవాల్లో భాగంగా నగర శివారులోని బి.తాండ్రపాడులో ఉన్న ప్రభుత్వ డైట్ కాలేజీలో సోమవారం గణిత టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళాను నిర్వహించారు. ఈ మేళాను ఆ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ షంషుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛాత్రోపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంచుకునేందుకు బోధనోపకరణాలు చక్కగా ఉపయోగపడతాయన్నారు. అనంతరంలో మేళాలో ఛాత్రోపాధ్యాయులు తయారు చేసిన బోధన, అభ్యసన ఉపకరణాలు ఆకట్టుకున్నాయి. గణిత మేళాలోని ఉపకరణాలను ఆ గ్రామంలోని ఎంపీపీ విద్యార్థులు తిలకించారు. అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



గణిత మేళాలోని నమూనాల గురించి వివరిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

సహకార సంఘ సభ్యుల ఈ–కేవైసీ పూర్తి చేయండి

కర్నూలు(అర్బన్): వ్యవసాయ సహకార సంఘాల్లోని సేవలన్నీ ఆన్‌లైన్ చేస్తున్న నేపథ్యంలో ఆయా పీఏసీఎస్‌ల్లోని సభ్యుల ఈ–కేవైసీని నిర్ణీత సమయంలోగా వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి కోరారు. సోమవారం మధ్యాహ్నం జెడ్పీలోని తన చాంబర్ నుంచి ఆయన ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ సహకార సంఘాల్లోని సభ్యుల ఈకేవైసీ పూర్తయితే రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు. అలాగే ఎంఎస్ఎంఈ, కుటుంబ సభ్యుల వివరాల సర్వేలో మిస్సింగ్ సిటిజన్స్ నమోదులో కూడా పురోగతి చూపించాలన్నారు. ఈ నేపథ్యంలోనే 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారుల ఆధార్ నమోదు చేసే ప్రక్రియను కూడా వేగవంతం చేసి వంద శాతం పురోగతి సాధించాలన్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగుల హాజరుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నిర్ణీత సమయం లోగా వారు హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలగే గైర్హాజరు అయిన వారి వివరాలకు సంబంధించిన జాబితాలను పంపించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రజోపకరమైన కార్యక్రమాలకు సంబంధించి ఇచ్చిన టాస్క్‌ను వెంటనే పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపాలన్నారు.



గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

గణిత విజ్ఞాన ప్రదర్శన

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్‌లోని నారాయణ స్కూల్‌లో గణిత విజ్ఞాన వారోత్సవాల్లో భాగంగా సోమవారం గణిత ప్రదర్శను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్ పాల్గొని గణిత మేధవి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రదర్శనను ప్రారంభించారు. ఎంతో మంది మేధావులు సాధించలేని గణిత సిద్ధాంతాలను అలవోకగా సులభమైన పద్ధతిలో ఆవిష్కరించి ప్రపంచ దృష్టిని తన వైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావిగా రామానుజన్ గుర్తింపు పొందారన్నారు. చిన్న వయస్సులోనే అసాధరణ ప్రతిభను ప్రదర్శించి ఆయిలర్ నియమాలను, త్రికోణమితికి చెందిన సమస్యలను సాధించారన్నారు. గణితం అంటే చాలా మంది పిల్లలకు భయం ఉంటుందని, కానీ కొంత దృష్టి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ అంశాలు తెలుసుకునేందుకు అనువైనది గణితమని అన్నారు. ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ గణిత నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలను ఏర్పాటు చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్

నేడు డయల్ యువర్ డీఎం

కర్నూలు సిటీ: ఆర్టీసీ సర్వీసులకు సంబంధించిన అంశాలతో పాటు వివిధ సమస్యల గురించి మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు వన్ డిపో మేనేజర్ కె.సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కార్గో కొరియర్ డోర్ డెలివరీకి సంబంధించి ఈ నెల 20 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు జరుగనున్న మాసోత్సవాల్లో భాగంగా కార్గో సేవల గురించి సైతం సమస్యలుంటే తెలియజేయవచ్చన్నారు. ప్రజలు 99592 25805 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

వీధికుక్కల బెడద నియంత్రణకు చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో శునకాల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం గార్గేయపురం డంప్ యార్డు వద్ద ఉన్న కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ల కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో ఆపరేషన్లు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించినట్లు చెప్పారు. జనవరి 8న భారత జంతు సంక్షేమ బోర్డు బృందం నగరానికి వస్తున్నట్లు చెప్పారు. అనుమతి మంజూరైన తరువాత రోజూ 20 శునకాలకు ఆపరేషన్లు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ గంగాధర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న ఉన్నారు.



శునకాల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

న్యూ ఇయర్ వేడుకలకు కాంగ్రెస్ దూరం

కర్నూలు(సెంట్రల్): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందిన కారణంగా నూతన సంవత్సర వేడుకలకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంటోందని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జవవరి 2వతేదీన మన్మోహన్‌సింగ్ సంతాప దినాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత కవారత్ జట్టుకు కప్పు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): యువత సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా క్రీడల్లో ప్రతిభ చాటాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాల క్రీడా మైదానంలో జేపీఎల్ –15 పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన కవారత్ వారియర్స్ టీమ్‌కు ఆయన, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి, కళాశాల పరిపాలన అధికారి శౌరిల్ రెడ్డితో కలిసి కప్పు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల స్నేహభావం పెంపొందుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్వీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు

కర్నూలు (టౌన్): పట్టణంలోని 40వ వార్డు సాయి ఎన్‌క్లేవ్ అపార్టుమెంటు వద్ద డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు విక్రమ సింహారెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు తమ కాలనీల సమస్యలపై వినతులు అందజేశారు. ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునీద్, ఎంఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని...

- బళ్లారి చౌరస్తా సమీపంలోని రిచ్మండ్ హోమ్స్‌లో మూడు నెలలుగా మంచినీరు సక్రమంగా రావడం లేదని కాలనీ వాసులు డేవిడ్, రామరాజు ఫిర్యాదు చేశారు.
- ఉల్చాల రహదారిలోని ఆదిత్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు ఫక్కీరప్ప విన్నవించారు.
- వీకర్ సెక్షన్ కాలనీ, శ్రీనివాస నగర్, సిద్ది వినాయక్ నగర్ కాలనీలకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉందని, వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు రఘు, వరలక్ష్మి నందీశ్వరుడు అర్జీ అందజేశారు.
- పైపులైన్ నిర్మాణం కారణంగా ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని బుధవార పేట సాధిక్, మస్జీద్ వాసులు షబ్బీర్, ప్రతాప్ కోరారు.



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి

- 21వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో పార్కు సమీపంలో వర్షపునీరు, మురుగు నీరు రహదారి పైకి వచ్చి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు రమేష్, శివ, తెలుగు విజయ్‌కుమార్, మోహన్ ఫిర్యాదు చేశారు.
- చిదంబరరావు వీధి ఉర్దూ స్కూల్ వద్ద మురుగు నీరు నిలిచి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు రాజు, షబ్బీర్, వీరేంద్ర, నూర్ అహమ్మద్ అర్జీ సమర్పించారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

కర్నూలు(సెంట్రల్): యాస్పిరేషనల్ బ్లాకుల్లో భాగంగా నీతి ఆయోగ్ అవార్డులు పొందిన మద్దికెర, చిప్పగిరి మండలాల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. 2024 జూలై, సెప్టెంబర్ త్రైమాసికాలకు సంబంధించి సౌత్ ఇండియాలో మద్దికెర మండలం 18వ ర్యాంకు, చిప్పగిరి మండలం 36వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. తద్వారా మద్దికెరకు రూ.కోటి, చిప్పగిరికి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయని, వాటి వినియోగానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆ మండలాలు ఉత్తమంగా నిలిచేందుకు కృషి చేసిన జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓలు, అధికారులను అభినందించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఎస్‌డీసీలు చిరంజీవి, కొండల పాల్గొన్నారు.

8 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి 8 నుంచి లా 3, 5 సంవత్సరాలు 2, 4, 6, 8, 10 సెమిస్టర్ల స్పెషల్ సప్లిమెంటరీ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ కంట్రోలర్‌ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల టైంటేబుల్‌ను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపినట్లు వెల్లడించారు.